● పీవీకి కుటుంబ సభ్యుల పుష్పాంజలి

పీవీ ఘాట్‌లో పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు. చిత్రంలో పీవీ తనయుడు పీవీ ప్రభాకర్‌రావు, కుమార్తె సురభి వాణీదేవి, పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్ రావు తదితరులు

● శాసన సభలో పీవీకి బీఆర్ఎస్ నివాళి

అసెంబ్లీలో ఏర్పాటు చేసిన పీవీ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

● పీవీ తనయ సురభి వాణీదేవికి అభినందనలు

శాసన మండలి ఆవరణలో పీవీ నరసింహారావు కుమార్తె సురభి వాణీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సత్యవతిరాథోడ్, బస్వరాజు సారయ్య, శేరి సుభాష్‌రెడ్డి, ఎల్ రమణ, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, భానుప్రసాద్‌రావు, నవీన్‌రావు, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వంటేరు యాదవరెడ్డి, దండె విఠల్, ఎంసీ కోటిరెడ్డి, దయాకర్ గుప్తా, ఎంఎస్ ప్రభాకర్

మన పీవీకి భారతరత్న

తెలంగాణ బిడ్డకు దేశ అత్యున్నత పురస్కారం

- మాజీ ప్రధాని చరణ్‌సింగ్, శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా సమున్నత గౌరవం
- ఈ ఏడాది మొత్తం ఐదుగురికి భారతరత్నాలు
- ఇటీవలే ఎల్‌కే అద్వానీ, కర్పూరీ ఠాకూర్‌కు అవార్డు
- దేశ ఆర్థిక గతిని మార్చిన పీవీ నరసింహారావు
- రైతుల జీవితాల్లో వెలుగుకోసం చరణ్‌సింగ్ పోరాటం
- దేశానికి హరిత విప్లవాన్ని అందించిన స్వామినాథన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధాన మంత్రి, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావును దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న వరించింది. 1991లో ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని కొత్త ప్రగతి మార్గం పట్టించిన అపర మేధావి, దివంగత పీవీకి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం భారతరత్న ప్రకటించింది. ఆయనతోపాటు మరో మాజీ ప్రధాని, రైతు ఉద్యమ నాయకుడు చరణ్‌సింగ్‌కు, భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ప్రధాని మోదీ స్వ యంగా ఈ ప్రకటన చేశారు. కొద్దిరోజుల క్రితమే బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌తోపాటు, బీజేపీ నేత ఎల్‌కే అద్వానీకి కూడా భారతరత్న ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఒకే ఏడాదిలో ఐదుమంది ప్రముఖులకు భారతరత్న ప్రకటించినట్టయ్యింది. ఆ అవార్డు చరిత్రలో ఒకేసారి ఇంతమందికి పురస్కారం అందించటం ఇదే మొదటిసారి. కేంద్రం ప్రకటనపై అధికార ప్రతిపక్షాలతోపాటు సామాన్యుల నుంచి కూడా హర్షాతిరేకాలు, అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

బలమైన ఆర్థిక పునాదులేసిన పీవీ: మోదీ

భారతరత్న పురస్కారం ప్రకటన సందర్భంగా పీవీ నరసింహారావును ప్రధాని నరేంద్రమోదీ 'రావుగారు' అని సంబోధించారు. దేశానికి పీవీ చేసిన సేవలను శ్లాఘించారు. 'పీవీ దూరదృష్టిగల నాయకత్వం దేశం ఆర్థికంగా ముందడుగు వే యటానికి ఎంతో తోడ్పడింది. దేశ ఆర్థిక శ్రేయస్సు, వృద్ధికి బలమైన పునాదులు వేసింది. రావుగారి పాలనాకాలంలోనే ప్రపంచమార్కెట్‌కు భారత్ తలుపులు తెరిచింది. దేశ ఆర్థికరంగంలో కొత్త శకం మొదలైంది. ప్రధానిగా విదేశీ విధానం, భాష, విద్య తదితర రంగాల్లో చేపట్టిన మార్పులు ఆయనలోని బహుముఖ ప్రజ్ఞకు తార్కాణాలు. దేశాన్ని క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేయటంతోపాటు భారతీయ సంస్కృతి, మేధో సంపత్తిని సుసంపన్నం చేశారు' అని మోదీ కొనియాడారు. మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించటం తమ ప్రభుత్వ అదృష్టమని పేర్కొన్నారు.ఎమ్మెల్యేగా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర హోంమంత్రిగా, ప్రధానిగా దేశ నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారని కొనియాడారు. శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ దేశానికి చేసిన సేవలను మోదీ గుర్తుచేశారు. 'భారత్ వ్యవసాయరంగంలో స్వయంసమృద్ధి సాధించటంలో స్వామినాథన్ అసాధారణ పాత్ర పోషించారు. ఆవిష్కర్తగా, విద్యార్థులకు మెంటార్‌గా వెలకట్టలేని పాత్ర పోషించారని శ్లాఘించారు. ఆయన పరిశోధనలు వ్యవసాయరంగంలో సమూల మార్పులు తేవటంతోపాటు దేశానికి ఆహార భద్రతను అందించాయని పేర్కొన్నారు.

నిశ్శబ్దంగా దేశాన్ని మార్చిన మేధావి

పీవీ నరసింహారావు బహుభాషావేత్తగా, రాజనీతిజ్ఞుడిగా, పరిశోధకుడిగా దేశ రాజకీయాల్లో అపర చాణక్యుడిగా పేరుతెచ్చుకొన్నారు. 1991 నుంచి 1996 వరకు ఐదేండ్లు పూర్తికాలం ప్రధానిగా పనిచేసిన పీవీ.. దేశానికి ఆర్థిక కష్టాల నుంచి బయటపడేసి, ఆధునికతవైపు పరుగులు పెట్టించారు. వీ ఆర్థిక సంస్కరణలతోనే భారత్ నేడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా నిలబడింది. పీవీ అధికారం చేపట్టేనాటికి దేశం ఎంతటి దుర్భర పరిస్థితుల్లో ఉన్నదంటే.. కనీసం అప్పులకు వడ్డీలు చెల్లించలేక చెల్లింపుల సంక్షోభం అంచుకు చేరింది. ఆ సమయంలో ఎంతో ధైర్యంగా అప్పటి ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్‌తో కలిసి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పారిశ్రామిక, సేవల రంగాలకు ప్రతిబంధకంగా మారిన రెడ్‌టేపిజాన్ని (అనుమతుల్లో అనవసర జాప్యం) తుడిచిపెట్టేశారు. దీంతో దేశంలోకి పెట్టుబడులు గట్టుతెంపుకొన్న నీటి ప్రవాహంలా వచ్చిపడ్డారు. దేశీయ పెట్టుబడిదారులు కూడా ఇబ్బడిముబ్బడిగా కంపెనీలను స్థాపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధానిగా ఉండీ ఏనాడో స్వాతం త్ర్యం వచ్చిన కొత్తలో మొదటి ప్రధాని నెహ్రూ వేసిన సోషలిజం ఆర్థిక విధానాలను ధైర్యంగా పక్కనబెట్టి, స్వేచ్ఛా వాణిజ్యానికి బాటలు వేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వంగరలో 1921 జూన్ 28న జన్మించిన పాముల పర్తి వెంకట నరసింహారావు ఉస్మానియా, బాంబే, నాగపూర్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించారు. ఓయూలో వందేమాతరం ఉద్యమంలో పాల్గొని బహిష్కరణకు గురయ్యారు. 1971 నుంచి 73 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రధాని కాకముందు కేంద్ర మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాలు, రక్షణ, హోంశాఖలను నిర్వహించారు. 83 ఏండ్ల వయసులో 2004 డిసెంబర్ 23న మరణించారు.

రైతు ఉద్యమాలకు చాంపియన్ చరణ్‌సింగ్

ఉత్తర భారత దేశంలో 1960, 70 దశాబ్దాల్లో పుట్టుకొచ్చిన బలమైన రైతు ఉద్యమాలకు తిరుగులేని నాయకుడిగా ఎదిగనారు మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్. కాంగ్రెస్ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన, బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించారు. నెహ్రూ సోషలిస్టు ఆర్థిక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించి, రైతులకు భూమిపై శాశ్వత హక్కులకు పోరాటం చేశారు. మొదట కాంగ్రెస్ అభిమానిగానే ఉన్న ఆయన.. 1960 దశకంలో ఆ పార్టీ నుంచి దూరం జరిగి మొత్తం ఉత్తరాధిలో కాంగ్రెసేతర ప్రభుత్వాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ఉత్తరప్రదేశ్‌లోని మేరట్ జిల్లాలో ఉన్న నూర్‌పూర్ గ్రామంలో 1902 డిసెంబర్ 23న జాట్ సామాజికవర్గానికి చెందిన నేత్రాకౌర్, చౌదరి మీర్ సింగ్ దంపతులకు చరణ్‌సింగ్ జన్మించారు. ఆగ్రా యూనివర్సిటీలో ఉన్నతవిద్యను అభ్యసించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు. నాటి యునైటెడ్ ప్రావిన్స్‌లో చప్రౌలీ అసెంబ్లీ స్థానం నుంచి 1937లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967 ఏప్రిల్ 1న సంయుక్త విధాయక్ దళ్ అభ్యర్థిగా తొలిసారి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. మొత్తం ఉత్తరభారతదేశంలోనే ఆయన తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి కావటం గమనార్హం. 1970లో రెండోసారి యూపీ సీఎంగా బాధ్యతలు చేపట్టినా, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చరణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దుచేసి 1970 అక్టోబర్ 2న రాష్ట్రపతిపాలన విధించింది. భారతీయ లోక్‌దళ్ పార్టీని స్థాపించి 1977లో కేంద్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటుకు కృషిచేశారు. జనతా ప్రభుత్వంలో 1979లో కేంద్ర ఆర్థికమంత్రిగా, ఆ తర్వాత ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. జనతాపార్టీ ముక్కలైన తర్వాత తాను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ మద్దతుతోనే 1979 జూలై 28న రెండో కాంగ్రెసేతర ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఆ పదవిలో ఎక్కువకాలం ఉండలేకపోయారు. అదే ఏడాది ఆగస్టు 20న ఆయన ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత ఆపద్ధర్మ ప్రధానిగా 1979 ఆగస్టు 21 నుంచి 1980 జనవరి 14 వరకు కొనసాగారు. 84 ఏండ్ల వయసులో 1987 మే 29న ఆయన తుదిశ్వాస విడిచారు.

వంగరలో సంబురాలు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ప్రకటించడంపై ఆయన స్వగ్రామం వంగరలో సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. పీవీ ఇంటిని కుటుంబసభ్యులు మ్యూజియంగా మార్చి ప్రధానిగా ఉన్న సమయంలో పీవీ వినియోగించిన వస్తువులు, ఫొటోలను ప్రత్యేక గ్యాలరీగా ఏర్పాటు చేశారు. పీవీ వినియోగించిన కారు ఇంటి ఆవరణలో ప్రదర్శనకు ఉంచారు. ఆయన ఇంటి ఎదుట కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఏటా పీవీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కుటుంబసభ్యులు ఇక్కడే నిర్వహిస్తారు.

దేశ ఆకలి తీర్చిన మేధావి స్వామినాథన్

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతా దేశ ప్రజల ఆకలిబాధ తీరలేదు. నిత్యం విదేశాల నుంచి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకొనేవారు. వ్యవసాయ రంగంలో కాలానుగుణంగా మార్పులు రాక అతి తక్కువ పంటలతో రైతులు నిత్యం ఆకలితోనే ఉండేవారు. ఆ సమయంలో ఎంఎస్ స్వామినాథ్ కొత్త వంగడాలను సృష్టించారు. ఆయన కృషితో అనతికాలంలోనే ఆహారధాన్యాల విషయంలో దేశం స్వయంసమృద్ధి సాధించింది. తమిళనాడు కుంభకోణంలో 1925 ఆగస్టు 7న స్వామినాథన్ జన్మించారు. 1949లో నెదర్లాండ్స్‌లోని వాగెనింజెన్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో తొలిసారి ఆలుగడ్డలపై సైటోజెనెసిస్ పరిశోధనలు మొదలుపెట్టారు. 1952లో జెనెటిక్స్‌లో కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేశారు. ఆ పరిశోధనల ఫలితంగా ఆయనకు కటక్‌లోని సెంట్రల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇండికా జపానికా రకం వరి వంగడంలో హైబ్రిడ్‌ను సృష్టించే పరిశోధన చేసేందుకు అవకాశం లభించింది. ఆ పరిశోధనే దేశంలో హరితవిప్లవానికి నాంది పలికింది. 1988లో రిసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించి ఎంతో మంది పరిశోధకులకు మెం టార్‌గా పనిచేశారు. వ్యవసాయ పరిశోధనలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ ఫుడ్ ప్రైజ్ 1987లో మొట్టమొదట స్వామినాథన్‌నే వరించింది. జీవితకాలంలో అనేక కీలక పదవులు అలంకరించిన ఆయన 2023 సెప్టెంబర్ 28న తుదిశ్వాస విడిచారు.

పీవీకి భారతరత్న హర్షనీయం: కేటీఆర్

తెలంగాణ బిడ్డ, తెలుగు ప్రజల గౌరవం మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించడం హర్షనీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పీవీ నరసింహరావుకు భారతరత్న రావడం యావత్తు తెలంగాణ గర్వించదగ్గ విషయమని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం పీవీకి భారతరత్న ప్రకటించడంపై మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్,పీవీ జయంత్యుత్సవాల కమిటీ సభ్యుడు మహేశ్ బిగాల, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం హర్షం వ్యక్తం చేశారు.

ఆలస్యమైనా గొప్ప గౌరవం దక్కింది: ఎమ్మెల్సీ వాణీదేవి

కొంచెం ఆలస్యమైనా తన తండ్రి పీవీ నరసింహారావుకు భారతరత్నతో గొప్ప గౌరవం దక్కిందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి హర్షం వ్యక్తంచేశారు. మాజీ ప్రధాని, తెలుగుతేజం పీవీకి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. పార్లిలకతీతంగా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. పీవీకి భారతరత్న రావడం తెలంగాణతోపాటు దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. ఇప్పటికీ ఆయన చేసిన ఆర్థిక సంస్కరణలే దేశానికి దిక్సూచి అని పేర్కొన్నారు. గొప్ప వ్యక్తులకు సన్మానం మన సంస్కారమని తెలిపారు.

తెలుగువారికి గర్వకారణం: పీవీ ప్రభాకర్‌రావు

పీవీకి భారతరత్న ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి గర్వకారణమని మాజీ ప్రధాని నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. పీవీ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల తరపున ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ పురస్కారం ఆరు దశాబ్దాలుగా అచంచలమైన అంకితభావంతో దేశానికి ఆయన చేసిన అసమానమైన సేవలకు నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. పీవీ గొప్ప పండితుడే కాకుండా బహుభాషా కోవిదుడని, మంచి దౌత్యవేత్త అని తెలిపారు. ఆయన చురుకైన నాయకత్వం, దార్శనిక విధానాలు భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేశాయని, మన దేశ ప్రగతిపథాన్ని రూపొందించాయని చెప్పారు. భారత రాజకీయాల్లో ఒక మహోన్నత వ్యక్తికి ఈ గౌరవాన్ని అందించడంలో చొరవ చూపిన ప్రధాని నరేంద్రమోదీకి మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ప్రభాకర్‌రావు తెలిపారు. పీవీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన పేరును భారతరత్నకు సిఫారసు చేయాలని శాసనసభలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించడంలో కీలకపాత్ర పోషించినందుకుగాను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పీవీ దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి గణనీయంగా సేవలందించేందుకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించిందని అన్నారు.

పీవీకి తగిన గుర్తింపు

పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో మన దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. మైనార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ పీవీ నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక ప్రగతిని గాడిన పెట్టారు. ప్రాంతాన్ని కాకుండా దేశాన్ని ఒక కుటుంబంగా చూసిన మహనీయుడు. పీవీకి భారతరత్న ప్రకటించిన ప్రధాని మోదీకి అభినందనలు.

–మదన్‌మోహన్‌రావు,
పీవీ సోదరుడి కుమారుడు

పీవీతో అనుబంధం మరువలేనిది

పీవీ ఇంటి వెనుకాల ఎడ్లపాక ఉండేది. ఆవులు, ఎద్దులు నేనే చూసుకునేటోడిని. వాటికి పచ్చగడ్డి తీసుకచ్చి వేసేది. పీవీ ఎప్పుడూ మమ్మల్ని పనోళ్లే లెక్క సూడలేదు. ఓ భూమ అంత మంచిదేనా? ఎట్లున్నవ్ అని అడిగేవారు. మా పీవీ సాబ్ ఇప్పటికీ నా కండ్లల్ల మెదులుతున్నరు.

–దాడి భూమయ్య,
వంగర (పీవీ స్వగ్రామం)

పీవీకి కాంగ్రెస్ అడుగడుగునా అన్యాయం

- మరణాంతరం కూడా అదే వివక్ష
- పార్టీ స్మారకం లేని ఏకైక ప్రధాని
- అధికారంలో ఉన్నా భారతరత్నకు నో

హైదరాబాద్, ఫిబ్రవరి9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ముద్దుబిడ్డ, సంస్కరణశీలి మాజీ ప్రధాని పీవీ నరసింహారావును సొంత పార్టీనే అడుగడుగునా అనేక అవమానాలకు గురిచేసింది. బతికి ఉన్నప్పుడే కాదు మరణానంతరం కూడా ఆ వివక్ష చూపింది. సొంత పార్టీ నేతగా కాంగ్రెస్ హైకమాండ్ గుర్తించలేదన్నది చారిత్రక సత్యం. దేశం అనేక సంక్లిష్ట సమస్యల్లో కూరుకుపోయిన తరుణంలో తన ప్రజ్ఞాపాటవాలతో మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేండ్లు ముందుకు నడపడమేకాకుండా భారత్‌ను ప్రగతి పథంలో నడింపించిన మహనీయుడు పీవీ. నేడు దేశంలో డబ్బు చలామణి పెరగడానికి, అంతర్జాతీయ కంపెనీలు రావడానికి పీవీ అమలు చేసిన ఆర్థిక సంస్కరణలే మూలస్తంభాలని, స్వయంగా మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ పలు సందర్భాల్లో వెల్లడించారు. అంతటి మహనీయుడు పీవీని కాంగ్రెస్ మాత్రం ఏనాడూ గౌరవించలేదు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు పీవీ పేరెత్తడానికి సైతం సాహసించలేదు. పదేండ్లు అధికారంలో ఉన్న సమయంలో ఆయనకు భారతరత్న ఇవ్వాలని తెలంగాణతోపాటు, ఎందరో మేధావులు డిమాండ్ చేసినా నాటి యూపీఏ సర్కారు పట్టించుకోలేదు. పీవీ సేవలను మరుగున పడేసేందుకే అడుగడుగునా యత్నించింది. తెలంగాణ ప్రభుత్వం పీవీ శతజయంతి ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించిన అనంతరమే మళ్లీ కాంగ్రెస్ నేతల్లో కొంత చలనం వచ్చింది. పీవీ మరణించినప్పుడు ఆయన అంత్యక్రియలను ఢిల్లీలోనే నిర్వహించాలని కుటుంబీకులు పట్టుబట్టారు. కానీ అప్పటి కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అది సాధ్యం కాదని చెప్పి పీవీ పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు పంపించారు. ఢిల్లీలో పీవీ స్మారకం నిర్మించాలన్న డిమాండ్‌ను కూడా కాంగ్రెస్ పట్టించుకోలేదు. మాజీ ప్రధానులందరికీ ఢిల్లీలో ప్రత్యేకంగా ఘాట్‌లు నిర్మించినా.. పీవీకి ఓ స్మారకం నిర్మించకపోవడం ఆ పార్టీ పెద్దలు తెలంగాణ బిడ్డ పీవీని అవమానించిన తీరుకు నిదర్శనం. పీవీ విషయంలో నాడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా తీవ్ర అన్యాయం చేసిందన్నది ఎవరూ కాదనలేని సత్యం. అనాటి కాంగ్రెస్ సర్కార్ హైదరాబాద్‌లో అత్యంత అవమానకరమైన రీతిలో పీవీ అంత్యక్రియలను నిర్వహించింది.

భారతరత్న రావడం గర్వకారణం

- స్వామినాథన్‌కు పురస్కారంపై కూతురు సౌమ్య స్పందన



కన్నూర్, ఫిబ్రవరి 9: ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడాన్ని ఆయన కూతురు సౌమ్య స్వామినాథన్ స్వాగతించారు. తన తండ్రి సేవలను గుర్తించి దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రకటించడం తమ కుటుంబానికి సంతోషంగా, గర్వకారణంగా ఉందని తెలిపారు. తమ తండ్రికి ఈ అవార్డు ఇవ్వడం శాస్త్ర సాంకేతికతలను ఉపయోగించి సమాజానికి సేవ చేయొచ్చనే సందేశాన్ని యువతకు అందిస్తుందని ఆమె అన్నారు. బతికుండగా ఈ అవార్డు ప్రకటించి ఉంటే ఎంఎస్ స్వామినాథన్ ఎలా స్పందించి ఉండేవారన్న ప్రశ్నకు ఆమె బదులిస్తూ 'ఈ వార్త విని ఉంటే ఆయన సంతోషించి ఉండేవారు కానీ ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదు. గుర్తింపు కోసం వేచి చూడలేదు. ఆయనకు ఎన్నో అవార్డులు, గుర్తింపులు

పీవీకి భారతరత్నను స్వాగతిస్తున్నా: సోనియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రదానం చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్వాగతించారు. శుక్రవారం ప్రభుత్వ నిర్ణయంపై ఆమెను ప్రశ్నించగా తప్పకుండా కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. మాజీ ప్రధానులు పీవీ, చరణ్‌సింగ్, హరిత విప్లవానికి మార్గదర్శకుడైన ఎంఎస్ స్వామినాథన్ భారత్‌కే రత్నాలని, దేశ ప్రగతిలో వారి సహకారం అపూర్వమైనది, భారతీయులందరూ వారిని గౌరవించారని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం పేర్కొన్నది. అయితే స్వామినాథన్ ఫార్ములా ఆధారంగా రైతులకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన హోదా కల్పించడంపై మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని తప్పు పట్టింది. కాగా, తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ఆకాశమంత ఎత్తున ఎగరేసిన తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని, ఆర్థిక మేధావి, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావుకు భారతరత్న దక్కడం గర్వించదగ్గ విషయమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీకి భారతరత్న రావడంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తంచేశారు.

ఇక పొత్తునెలా కాదనగలను!

- బీజేపీతో పొత్తుపై ఆర్ఎల్డీ చీఫ్ జయంత్ చౌదరి వ్యాఖ్య
- చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వడంపై మోదీపై ప్రశంసలు

జయంత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆయన మనుమడు, రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్డీ) అధినేత జయంత్ చౌదరి రాజకీయంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలో బీజేపీతో జట్టు కట్టనున్నట్టు సంకేతం ఇచ్చారు. చరణ్ సింగ్‌కు భారతరత్న ప్రకటనపై శుక్రవారం ప్రధాని మోదీ పోస్టు చేసిన సరిగ్గా 13 నిమిషాలకు ఆ పోస్టును రీట్వీట్ చేస్తూ.. 'దిల్ జీత్ లియా(హృదయాన్ని గెలుచుకొన్నారు)' అంటూ జయంత్ పోస్టు చేశారు. తన తాత చరణ్‌సింగ్‌కు భారతరత్న పురస్కారం ప్రకటనపై సంతోషం వ్యక్తం చేసిన ఆయన.. మోదీ సర్కార్‌పై ప్రశంసలు కురిపించారు. తాజా పరిణామాల నేపథ్యంలో 'బీజేపీతో పొత్తు కడుతారా?' అని మీడియా జయంత్ చౌదరిని ప్రశ్నించగా.. 'ఇంకేమైనా మిగిలుందా? దీన్ని నేను ఎలా తిరస్కరించగలను' అంటూ సమాధానం ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన త్వరలో సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుకు గుడ్‌బై చెప్పి బీజేపీతో జట్టు కట్టనున్నారని ఇప్పటికే కొనసాగుతున్న ఊహాగానాలకు ఇది బలం చేకూర్చినట్టు అయింది.

ఈ రోజున మోదీ చేశారు..

'గత ప్రభుత్వాలు చేయలేనిది, ఈ రోజున ప్రధాని మోదీ చేశారు. ఆయన గొప్ప నిబద్ధత, విజన్‌తో ఈ నిర్ణయం తీసుకొన్నారు' అంటూ జయంత్ చౌదరి ప్రసంశలు కురిపించారు. దేశ సెంటిమెంట్, ఆలోచనలను ప్రధాని మోదీ అర్థం చేసుకొన్నారని అన్నారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పిన జయంత్ చౌదరి, ఇది తనకు చిరస్మరణీయమైన రోజు అని, భావోద్వేగమైన క్షణమని ఆనందం వ్యక్తం చేశారు. 'ముగ్గురికి భారతరత్న ప్రకటించినందుకు రాష్ట్రపతి ముర్ము, బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఈ నిర్ణయంతో ప్రజల సెంటిమెంట్ ముడిపడి ఉన్నది' అని జయంత్ పేర్కొన